# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 25-06-2025** **సమయం : 6.45 గంటలు**

# ముఖ్యాంశాలు

**1. స్వర్ణాంధ్ర-2047 విజన్‌కు అనుగుణంగా యువతకు నైపుణ్య శిక్షణ ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు.**

**2. రైతుల సంక్షేమమే ప్రభుత్వ మొదటి ప్రాధ్యానమని తెలంగాణ ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి అన్నారు.**

**3. ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో మౌలిక వసతుల కోసం భూ సమీకరణ చేసేందుకు మంత్రి వర్గం ఆమోదం తెలిపింది.**

**4. కృష్ణా విశ్వవిద్యాలయంలో ఈరోజు జరిగే స్నాతకోత్సవ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ పాల్గొంటారు.**

**5. తెలంగాణలో న్యాయ విద్య ప్రవేశాల కోసం నిర్వహించిన లాసెట్, పీజీఎల్‌సెట్ పరీక్ష ఫలితాలు ఈరోజు విడుదల కానున్నాయి.**

**6. దేశంలో అత్యవసర పరిస్థితి విధించి 50 ఏళ్ళు పూర్తయిన సందర్భంగా ఈరోజుని 'సంవిధాన్ హత్య దివస్'గా నిర్వహిస్తున్నారు.**

==========================

స్వర్ణాంధ్ర-2047 విజన్ ప్రణాళికలకు అనుగుణంగా యువతకు నైపుణ్య శిక్షణ ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. అమరావతిలోని సచివాలయంలో నైపుణ్యాభివృద్ధి శాఖపై ముఖ్యమంత్రి నిన్న సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ, యువతకు 20 లక్షల ఉద్యోగాల కల్పనే ప్రధాన లక్ష్యంగా రాష్ట్రంలో నైపుణ్య శిక్షణ అందించాలని చెప్పారు. పెట్టుబడులకు అనుగుణంగా ఉద్యోగాలు సాధించేలా యువతకు నైపుణ్య శిక్షణ ఇవ్వాలని ముఖ్యమంత్రి అధికారులకు దిశానిర్దేశం చేశారు.

--------------------------

రైతుల సంక్షేమమే ప్రభుత్వ మొదటి ప్రాధ్యానమని తెలంగాణ ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లోని రాష్ట్ర సచివాలయం ఎదురుగా వ్యవసాయ శాఖ ఏర్పాటు చేసిన రైతు నేస్తం కార్యక్రమంలో ముఖ్యమంత్రి గత సాయంత్రం పాల్గొన్నారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ.. తెలంగాణలో వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు ప్రభుత్వం రైతులకు అండగా ఉంటుందని చెప్పారు.

9 రోజుల్లో 9 వేల కోట్ల రూపాయలను రైతుల ఖాతాల్లో జమ చేశామని తెలుపుతూ,

వాయిస్...30 సెకన్లు

-------------------------

ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో మౌలిక వసతుల కోసం భూ సమీకరణ చేయాలని మంత్రి వర్గం నిర్ణయించిందని సమాచార, ప్రజా సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అధ్యక్షతన జరిగిన మంత్రివర్గ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను మంత్రి పాత్రికేయులకు వివరించారు. స్వర్ణాంధ్ర పీ4పై త్వరలో కమిటీలు ఏర్పాటు చేయనున్నామని తెలిపారు. రాజధాని అమరావతిలో రెండవ విడత భూసేకరణలో భాగంగా మరో 44 వేల ఎకరాల సేకరణకు మంత్రివర్గం ఆమోదం తెలిపిందని మంత్రి తెలియజేస్తూ,

వాయిస్ ...30 సెకన్లు

-------------------------

కృష్ణా విశ్వవిద్యాలయంలో ఈరోజు జరిగే స్నాతకోత్సవ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్, రాష్ట్ర మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేష్ పాల్గొంటారు. ఇందుకు సంబంధించిన అన్ని ఏర్పాట్లను పూర్తి చేశామని విశ్వవిద్యాలయ ఉపకులపతి కూన రాంజీ తెలిపారు. మచిలీపట్నంలో నిన్న ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ, స్నాతకోత్సవ కార్యక్రమంలో కృష్ణా జిల్లాకు చెందిన ముగ్గురు ప్రముఖులకు గౌరవ డాక్టరేట్, ఉత్తమ ప్రతిభ కనబరిచిన 72 మంది విద్యార్థులకు బంగారు పతకాలు గవర్నర్ చేతుల మీదుగా అందించనున్నామని తెలిపారు.

-------------------------

ఆంధ్రప్రదేశ్ లో భవన నిర్మాణాల నిబంధనలు సరళతరం చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నామని పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి. నారాయణ తెలిపారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో మంత్రి నిన్న పాత్రికేయులతో మాట్లాడారు. అమరావతిలో క్రీడా కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు భూసేకరణ చేయనున్నామని మంత్రి తెలుపుతూ,

వాయిస్..30 సెకన్లు

-------------------------

తెలంగాణలో న్యాయ విద్య ప్రవేశాల కోసం నిర్వహించిన లా కామన్ ఎంట్రన్స్ టెస్ట్– లాసెట్, పీజీ లా కామన్ ఎంట్రన్స్ టెస్ట్ –పీజీఎల్‌సెట్ పరీక్ష ఫలితాలు ఈరోజు విడుదల కానున్నాయి. ఇటీవల ప్రాథమిక కీ విడుదల చేసిన ఉన్నత విద్యామండలి అధికారులు ఈరోజు మధ్యాహ్నం 3 గంటల 30 నిమిషాలకు ఫలితాలు విడుదల చేయనున్నట్లు వెల్లడించారు. ఈ ఫలితాలను రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఛైర్మన్ ఆచార్య వి.బాలకిష్టారెడ్డి విడుదల చేస్తారు.

-------------------------

దేశంలో జూన్ 25, 1975న, అప్పటి ప్రధానమంత్రి అత్యవసర పరిస్థితిని విధించిన నేపథ్యంలో భారత ప్రభుత్వం ఈరోజుని 'సంవిధాన్ హత్య దివస్' –రాజ్యాంగ హత్య దినంగా పాటిస్తోంది. 1975 అత్యవసర

పరిస్థితిని ఎదుర్కొన్న వారందరిని స్మరించుకుంటూ, ప్రతి భారతీయుడిలో వ్యక్తిగత స్వేచ్ఛ, ప్రజాస్వామ్య రక్షణపై అవగాహన కల్పిస్తుంది. హింసను ఎదుర్కొన్నప్పటికీ ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరించడానికి పోరాడిన లక్షలాది మంది స్ఫూర్తిని గౌరవించడమే 'సంవిధాన్ హత్య దివస్ నిర్వహణలోని ముఖ్య ఉద్దేశం.

---------------------------

దేశంలో అత్యవసర పరిస్థితిని విధించి ఈ రోజుతో 50 ఏళ్లు పూర్తయిన నేపథ్యంలో ఆ కాలంలో జరిగిన మానవ హక్కుల ఉల్లంఘనలను నేటి తరానికి తెలియజేసేలా ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా అవగాహన సదస్సులు నిర్వహించనున్నట్లు భారతీయ జనతా పార్టీ ఒక ప్రకటనలో తెలిపింది. ఏలూరులో ఈ రోజు జరిగే అవగాహన సదస్సులో వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ పాల్గొంటారని.. పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లులో సదస్సులో రాజ్యసభ సభ్యులు పాకా వెంకట సత్యనారాయణ, తిరుపతిలో జరిగే సదస్సులో జాతీయ అధికార ప్రతినిధి, భువనేశ్వర్ ఎంపీ అపరాజిత షడంగి పాల్గొంటారని తెలిపింది.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో ఎంటెక్, ఎంఫార్మసీ, ఫార్మా డి కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించిన ఏపీ పీజీఈసెట్–2025 ఫలితాలు విడుదలయ్యాయి. ఈ ఫలితాలను రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా గత సాయంత్రం విడుదల చేశారు. ఇంజినీరింగ్, ఫార్మసీకి సంబంధించి 13 సబ్జెక్టుల్లో నిర్వహించిన ఈ పరీక్షలో 93.55శాతం ఉత్తీర్ణత నమోదైనట్లు తెలిపారు. మొత్తంగా 14 వేల 231 మంది ఈ పరీక్షకు నమోదు చేసుకోగా.. 11 వేల 244 మంది అర్హత సాధించారన్నారు. ఈ పరీక్షలో విజయం సాధించిన విద్యార్థులకు మంత్రి లోకేశ్ అభినందనలు తెలిపారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని ప్రస్తుత వాతావరణ పరిస్థితి గురించి అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం అధికారి ఎల్. నారాయణ ఆకాశవాణి ప్రాంతీయ వార్తా విభాగానికి వివరిస్తూ..

వాయిస్…28 సెకన్లు

మరోవైపు.. తెలంగాణాలోని కొన్ని జిల్లాల్లో రానున్న ఐదు రోజులపాటు ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది.

=====================